క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.చంద్రశేఖర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు సన్మానం



వెల్లటూరు(భట్టిప్రోలు): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న వెల్లటూరు పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ బడుగు శివాజిని శుక్రవారం వైద్యశాలలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ, పీహెచ్‌సీ చైర్‌పర్సన్ దావూరి వెంకట లలిత కుమారి శివాజిని అభినందించారు. పీహెచ్‌సీ వైద్యులు రామలక్ష్మి, ఫార్మసిస్ట్ జె.శివకుమారి, సూపర్ వైజర్ వై.శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాల వాగ్వాదం, దాడి

తొట్టెంపూడి(వేమూరు) : యానిమేటరు తొలగింపుపై రెండు వర్గాల మధ్య గొడవ నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చుండూరు మండలంలోని తొట్టెంపూడి గ్రామంలో తమనం సునీత యానిమేటర్‌గా తొలగించారు. ఆమె స్థానంలో తెలుగు దేశం పార్టీకి చెందిన జాలాది వాణి నియమించారు. తమనం సునీత బుధవారం పాల కేంద్రానికి వెళ్లి వస్తుండగా.. తమనం ముసలయ్య ఇంటి వద్ద వాణి బంధువులు పుస్తకాలు ఇవ్వమని అడిగారు. చుండూరు వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఇస్తానని చెప్పడంతో.. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వాణి భర్త సురేష్ రాడ్డుతో వైఎస్సార్ సీపీ చెందిన ముసలయ్య తల పగలు కొట్టాడు. 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వం వైద్య శాలకు అతనిని తరలించారు. ప్రభుత్వ వైద్య శాల అవుట్ పోలీసు స్టేషన్ సమాచారం మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



గుంటూరు రూరల్: వ్యసనాలకు బానిసై, సులువుగా డబ్బు సంపాదించేందుకు వాహనాల చోరీని ఎంచుకున్న నిందితుడిని నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అడవి తక్కెళ్లపాడులోని పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, సీఐ వంశీధర్ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా, చిలకలూరిపేట పట్టణంలోని.. క్రిష్టియన్ పేటకు చెందిన గట్టుపల్లి ప్రదీప్ వ్యసనాలకు బానిసై ద్విచక్ర వాహనాలు చోరీ చేసి, వాటిని విక్రయించి జల్సాలు చేసేవాడు. కొంతకాలంగా రూరల్ మండలంలో ద్విచక్ర వాహనాల చోరీ ఘటనలపై కేసులు నమోదవుతున్న తరుణంలో పోలీసులు నిఘా పెంచారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. నిందితుడు వై జంక్షన్ సమీపంలో ఉన్నాడన్న సమాచారం మేరకు శుక్రవారం అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో నిందితుడు చోరీలను ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి సుమారు రూ.6,50,000 విలువ చేసే 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకునేందుకు చాకచక్యంతో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు రూరల్: మతి స్థిమితం లేని యువకుడు కనిపించకపోవడంపై నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ వివరాల మేరకు.. గోరంట్ల గ్రామం రామాలయం వీధికి చెందిన సుమారు 16 ఏళ్ల వయస్సు గల కిలారి జస్వంత్ ఈ నెల 11 నుంచి కనిపించడం లేదని తండ్రి పవన్ కుమార్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆచూకి తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో, 86888 31376కు సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన నల్లపాడు గ్రామంలో చోటు చేసుకుంది. నల్లపాడు గ్రామానికి చెందిన ఇంటూరి హనిమిరెడ్డి పత్తి మిల్లులో పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం హౌసింగ్ బోర్డ్ నుంచి తన ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తుండగా వాహనం అదుపు తప్పి నల్లపాడు సమీపంలో డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో హనిమిరెడ్డికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

కాల్వలు ఇలా.. సాగు ఎలా..?

- ఖరీఫ్ సీజన్‌ను ప్రారంభించిన రైతులు
- చెత్తా చెదారం, పిచ్చి మొక్కలతో పంట కాల్వల దర్శనం



చెత్తా చెదారంతో నిండి ఉన్న వెస్ట్ బాపట్ల చానల్



పిచ్చిమొక్కలతో న్యూ ముత్తాయపాలెం చానల్



కాల్వ పక్కనే వరి నారుమడి

బాపట్ల: అన్నదాతల అభ్యున్నతే ధ్యేయం...అన్నదాతలకు ఎలాంటి అవసరం వచ్చినా నేరుగా కలవొచ్చు....రైతు సంక్షేమానికే మన ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని సభలు... సమావేశాల్లో ఉదరగొట్టే పాలకులు అన్నదాతలకు సీజన్‌కు ముందు కాల్వలను మరమ్మతులు చేయించి పెట్టడం మాత్రం మరుస్తున్నారు. సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో నీరందించేలా కాలువలు సిద్ధం చేసి ఉండాలని సూచనలు జారీ చేస్తున్నప్పటికీ.. అవి మాటలకే పరిమితం అవుతున్నాయే కానీ ఆచరణలో మాత్రం అమలు జరగటం లేదు.

కాల్వల దుస్థితి..

మండలంలోని న్యూ ముత్తాయపాలెం చానల్ నందిరాజుతోట నుంచి ముత్తాయపాలెం వరకు ఉంది. ఈ కాల్వ నుంచి నందిరాజుతోట, గులాం హుస్సేన్ తోట, మచ్చావారి పాలెం, చింతావారి పాలెం, ముత్తాయ పాలెంలోని కొంత మేర రైతులకు సాగు నీరు అందించాల్సి ఉంది. అయితే కాల్వలకు సకాలంలో మరమ్మతులు నిర్వహించకపోవడంతో మచ్చావారిపాలెం, చింతావారిపాలెం, ముత్తాయపాలెం గ్రామాల్లోని శివారు భూములకు చుక్క నీటిని కూడా అందించిన దాఖలాలు లేవు.

- అదేవిధంగా వెస్ట్ బాపట్ల చానల్ మండలంలోని దరివాదకొత్తపాలెం నుంచి ముత్తాయపాలెం వరకు ఉంది. ఈ చానల్ క్రింద దరివాద కొత్తపాలెం, బాపట్ల పట్టణంలోని ఇమ్మడిశెట్టివారి పాలెం, మురుప్రోలువారి పాలెం, మద్దిబోయినవారి పాలెం, కొత్తమద్దిబోయినవారి పాలెం, ముత్తాయ పాలెం గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. ఈ కాల్వలను కూడా సకాలంలో మరమ్మతులు చేయించకపోవడంతో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నాయి. ఓ వైపు రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టి 15 రోజులు అవుతున్నా.. కాల్వల అభివృద్ధిపై కనీసం చొరవ తీసుకోకపోవడంతో ఈ ఏడాది కాలవల అభివృద్ధి లేనట్లేనని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- వీటితోపాటు వెస్ట్ బాపట్ల పరిధిలోని మరుప్రోలువారిపాలెం, అసోదివారిపాలెం, బసివిరెడ్డిపాలెం, దేవినూతల, గవినివారిపాలెం, పుల్లాయపాలెం గ్రామాలకు కూడా సాగునీటిని అందించాల్సి ఉంది. కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో శివారు ప్రాంతాల్లోని రైతులు ఎత్తిపోతల పథకాలు, డీజిల్ ఇంజన్లను ఆశ్రయించి, సాగుచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా కాల్వల పరిధిలోని ఆయకట్టు భూములకు సకాలంలో నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పేదోడి గూడుపై 'కూటమి' కుట్ర

జగనన్న కాలనీకి విద్యుత్ సరఫరా నిలుపుదల



విద్యుత్ సరఫరా నిలుపుదల చేసిన వేమూరులోని జగనన్న కాలనీ

వేమూరు: ప్రతిపక్ష పార్టీపై ఉన్న పగను..ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదోడిపై తీర్చుకుంటోంది. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు పరోక్షంగా ఆటంకాలు సృష్టిస్తూ.. ప్రత్యక్షంగా ఇళ్లు నిర్మించుకోవాలంటూ లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తోంది. ఇందుకు నిదర్శనం.. మండల కేంద్రంలోని కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం. పేదలందరికీ ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల పేరుతో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి, ఇంటి నిర్మాణానికి తోడ్పాటునందించారు. వేమూరు మండల కేంద్రంలో 21 ఎకరాలు భూమి కొనుగోలు చేసి, 759 మంది కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించారు. లబ్ధిదారులు ముమ్మరంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికలు కోడ్ రావడంతో నిర్మాణ పనుల పురోగతి మందగించింది.

కుట్రలో మొదటి అడుగు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. అందులో భాగంగా మొదటి అడుగు వేసింది. పంచాయతీ అధికారులు కాలనీకి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో గృహ నిర్మాణం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి భూపతి వివరణ ఇస్తూ.. గ్రామ పంచాయతీలో విద్యుత్ బిల్లు భారమైందని తెలిపారు. అందుకే జగనన్న కాలనీలో విద్యుత్ నిలిపి వేసినట్లు చెప్పారు.

గృహ నిర్మాణశాఖ అధికారుల ఒత్తిడి

మాజీ మంత్రి, స్థానిక మాజీ ఎమ్మెల్యే మేరుగ నాగార్జున 2021 జనవరి 7న జగనన్న కాలనీలో గృహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కొంత మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు. మరి కొంత మంది పునాదులు వేశారు. ప్రస్తుతం గృహ నిర్మాణ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకుండా.. ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నారు. విద్యుత్ సరఫరా, నీటి సౌకర్యం లేకుండా గృహ నిర్మాణం పనులు ఎలా చేపడతామని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత అన్యాయం



జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం అన్యాయం. మా లాంటి పేదలకు గూడు కల్పించేందుకు జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఇళ్లు నిర్మాణానికి అడ్డుపడేందుకే విద్యుత్ సరఫరా నిలిపి వేశారు.

– అమర్తలూరు వెంకయ్య, లబ్ధిదారుడు, వేమూరు

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

భట్టిప్రోలు: మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం భట్టిప్రోలు బౌద్ధ స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘీయులు పాల్గొన్నారు. లచ్చన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని పలువురు కోరారు. ఆయన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని తెలియజేశారు. గౌడ సంఘ నిర్వాహకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హరే రామ హరే కృష్ణ..



వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు గీతాజ్ఞాన మందిరంలో హరే రామ హరే కృష్ణ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గత 16 నెలలుగా నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వాహకులు వేములపల్లి వనజాక్షి తెలిపారు. గురువారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుమల తిరుపతి దేవస్థానం, దాస సాహిత్య ప్రాజెక్ట్ ఉమ్మడి గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ ముకుందేశ్వరస్వామి విచ్చేశారు. పారాయణం అనంతరం సత్సంగం, సామూహిక హారతులు జరిగాయి. గ్రామానికి చెందిన క్రాప రవి కుమార్ ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, దాస సాహిత్య ప్రాజెక్ట్ భజన బృందాల మహిళలు, భక్తులు, వెల్లటూరు పరిసర గ్రామాల భజన బృందాలు పాల్గొన్నాయి.

గృహాల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి

వేమూరు: ప్రధాన మంత్రి అవాజ్ యోజన పథకం కింద వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని బాపట్ల జిల్లా గృహ నిర్మాణం పథకం ప్రాజెక్ట్ అధికారి ప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై శుక్రవారం మండల స్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ దశల్లో 346 ఇళ్ల నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. వాటిని వెంటనే వంద రోజుల్లో పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. గృహ నిర్మాణం మండల ప్రత్యేకాధికారి వి.బి విలియం మాట్లాడుతూ ప్రధాన మంత్రి అవాజ్ యోజన కింద మంజూరైన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అధికారులందరు ప్రత్యేక దృష్టి సాధించి, ఇళ్లు నిర్మాణం పూర్తి చేయాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణం డీఈ సీతారామయ్య, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ బి.సుశీల, మండల పంచాయతీ అధికారి సి.హెచ్ శేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వయ్యారి భామ మొక్కలపై అవగాహన సదస్సు



మొక్కల గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్‌కుమార్

గుంటూరు రూరల్: వయ్యారి భామ మొక్కలు పంటలకేగాకుండా జీవరాశులకు ఎంతో ప్రమాదకరమని కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నగర శివారులోని లాం నందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో పార్థీనియా (వయ్యారి భామ) కలుపు మొక్కలపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సైంటిస్ట్ మాట్లాడుతూ పుష్పించే జాతి మొక్క అతి త్వరగా ఏపుగా పెరిగి పంట పొలాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. దీంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. అంతేకాకుండా ప్రజలు, పశువుల ఆరోగ్యంపై కూడా దీని ప్రభావం చూపుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమం నేటి నుంచి 22వ తేదీ వరకూ కొనసాగుతుందని తెలిపారు. ఈ మొక్కలను పీకి అనంతరం తగలబెట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు, మహిళా రైతులు తదితరులున్నారు.

పోషకాల యాజమాన్యంపై శిక్షణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వెంకటరాములు

పొన్నూరు: మండలంలోని ములుకుదురులో శుక్రవారం సమగ్ర పోషకాల యాజమాన్యంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు పాల్గొని వరిలో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ముడి జింకు దుక్కిలో 20 కేజీలు ఒక ఎకరానికి వేసుకోవాలని తెలిపారు. ఇది కుదరకపోతే చిలేటెడ్ జింక్ పైపాటుగా రెండుసార్లు వారం రోజుల వ్యవధిలో పిచికారి చేయాలని తెలిపారు. పొటాష్‌ను దుక్కిలో, చిరుపొట్ట దశలో రెండు దఫాలుగా కలిపి 50 కేజీలు వాడుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.రాజీ వంశీ, రైతు నాయకులు రామారావు, మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకట్రామయ్య, చింతలపూడి, నందూరు, ములుకుదురు నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించాలి

కాకుమాను: మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది కౌలు రైతులను గుర్తించి, వారందరికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని తహసీల్దార్ పి.శంకర్‌బాబు అన్నారు. పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కౌలు రైతు గుర్తింపు కార్డులపై వ్యవసాయ శాఖ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఏవో సుధారాణి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 3,534 మంది కౌలు రైతులను గుర్తించి, 1,687 మందికి కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు.

మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషిచేయాలని ఎన్‌సీసీ కల్నల్ నీరజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నల్లపాడు గ్రామంలోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు ఒన్ క్యాడెట్ ఒన్ ట్రీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ క్యాడెట్స్ మొక్కలు నాటారు. ఎన్‌సీసీ గుంటూరు యూనిట్ సుబేదార్ జయప్రకాష్, హవల్దార్ గోవిందరాజు, ప్రిన్సిపల్ టి.శేఖర్, ఎన్‌సీసీ ఆఫీసర్ నిస్సినలోమన్ పాల్గొన్నారు.

'ఈ-పంట' నమోదు చేయించాలి

పెదకాకాని: ఈ-పంట యాప్‌లో సాగు చేస్తున్న పంటలను నమోదు చేయాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవ తేజ అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించేందుకు జేసీ భార్గవ్ తేజ, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు విచ్చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వాస్తవంగా పంటలు సాగు చేస్తున్న రైతులను గుర్తించి సకాలంలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ముగించాలన్నారు. మండలంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించిన వివరాలను గుర్తించి, రికార్డు తయారు చేయాలన్నారు. వీఆర్వోలతో వ్యవసాయ కార్యాలయ సిబ్బంది(ఏఈఓ, వీఏఏలు) కలసి సకాలంలో డేటా అందజేయాలని ఆదేశించారు. ఉప్పలపాడు వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయంలో రైతుల వివరాలు కంప్యూటరైజేషన్ ప్రక్రియ తెలుసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి ఇ.సంధ్యారాణి, ఏఈఓ శివాజీ, వీఆర్వో ముఖర్జీ, రైతులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో శ్రీ దండి పార్వతీదేవి



భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామదేవత శ్రీ దండి పార్వతి అమ్మవారికి శ్రావణ శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐలవరం గౌడపాలెంలోని శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనగాని తిరుమలరావు-రమాదేవి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని దేవాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.

బూరుగులమ్మ నమోస్తుతే



రేపల్లె రూరల్: పవిత్ర శ్రావణ శుక్రవారం గ్రామ దేవత శ్రీ బూరుగులమ్మ, ఓల్డ్‌టౌన్‌లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో వేకువజాము నుంచే సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీదేవిగా అలంకరణ చేశారు. బూరుగులమ్మ వారికి 108 బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి ఇంటికి వెళ్లి శాంపిల్స్ సేకరించాలి

- జ్వరాలు పూర్తిగా తగ్గేంత వరకు సిబ్బంది అందుబాటులో ఉండాలి
- మలేరియా డిప్యూటీ డైరెక్టర్ ఎ.టి.రామ్‌నాథ్‌రావు



సిబ్బందితో మాట్లాడుతున్న రామ్‌నాథ్‌రావు

బాపట్లటౌన్: ఆరోగ్య సిబ్బంది ముత్తాయపాలెంలోని ప్రతి ఇంటికి వెళ్లి రక్త నమూనాలను సేకరించాలని మలేరియా డెప్యూటీ డైరెక్టర్ ఎ.టి. రామ్‌నాథ్‌రావు తెలిపారు. మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. తొలుత గ్రామాల్లోని జ్వరాలపై వైద్యాధికారులతో మాట్లాడి, వివరాలు సేకరించారు. గ్రామాల్లో జ్వరాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేంత వరకు ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ వారికి రక్త నమూనాలు సేకరించాలన్నారు. రక్త పరీక్షల ఆధారంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ లక్షణాలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే వారిని పట్టణంలోని ఏరియా వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. చెత్తా చెదారం నిల్వలను వెంటనే తొలగించి వాటి స్థానంలో బ్లీచింగ్, సున్నం చల్లించాలన్నారు.

వీధులన్నీ పరిశుభ్రం...ఊరంతా ఫాగింగ్



ముత్తాయపాలెం వీధిలో బ్లీచింగ్ చల్లిన పారిశుద్ధ్య సిబ్బంది



మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది



గ్రామంలో ఫాగింగ్ చేయిస్తున్న ఈవోపీఆర్డీ శరత్‌బాబు

స్పందించిన పంచాయతీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బాపట్లటౌన్: వారం రోజుల క్రితం ముత్తాయపాలెం గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తా చెదారం నిల్వలు, ఏ వీధికెళ్లినా దుర్గంధం స్వాగతం పలికేది. నిలిచిన మురుగునీరు.. ఊరంతా జ్వరాల భారిన పడిన విషయాన్ని సాక్షి ఈ నెల 15న ''మంచం పట్టిన ముత్తాయపాలెం'' శీర్షికతో ప్రచురించిన కథనం అటు వైద్యాధికారులతోపాటు ఇటు పంచాయతీ అధికారులను కదలించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలోని చెత్తా చెదారం నిల్వలను పూర్తిగా తొలగించారు. ఎప్పటి నుంచో గ్రామ శివారులో ఉన్న డంపింగ్ యార్డును కూడా పొక్లెయిన్ సాయంతో తొలగించారు. గ్రామాల్లోని చెత్తా చెదారం నిల్వలను తొలగించి, బ్లీచింగ్, సున్నం చల్లించారు. మురుగు నీరు నిలిచే ప్రాంతాల్లో అయిల్ బాల్స్ స్ప్రే చేయించారు. రాత్రి ఊరంతా ఫాగింగ్ చేయించారు. రోడ్లపై ఎరువు గుట్టలు వేసే యజమానులకు నోటీసులు అందజేశారు. పూర్తిగా గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రం చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సాధారణ వైద్య సేవలు బంద్

రేపల్లె రూరల్: కోల్‌కతాలోని వైద్య పీజీ విద్యార్థినిపై జరిగిన అమానుష ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా రేపల్లె పట్టణంలోనూ శనివారం వైద్య సేవల బంద్ నిర్వహిస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ వసంతం వీర రాఘవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వైద్యులు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు సంఘీభావం తెలిపి ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. వైద్యశాలలో కేవలం అత్యవసర కేసులను మాత్రమే పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

బాపట్లలో...

బాపట్ల: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా శనివారం సాధారణ వైద్య సేవలను నిలుపుదల చేస్తునట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బాపట్ల బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు హక్, మధు సోలమన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రమే శనివారం కొనసాగించాలని తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు సేవలు నిలుపుదల చేస్తున్నాట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు బాపట్ల ఏరియా వైద్యశాల నుంచి నిరసన ప్రదర్శన ఉంటుందని, వైద్యులు, ప్రజలు పాల్గొని, సహకరించాలని కోరారు.

వీవీఐటీలో జేబీఎం చైర్మన్ పర్యటన

పెదకాకాని: ప్రఖ్యాత ఆటో కాంపోనెంట్ అండ్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ వాహనాల తయారీ సంస్థ జై భారత్ మారుతీ (జేబీఎం) లిమిటెడ్ వైస్ చైర్మన్ నిశాంత్ ఆర్యా, సౌత్ ఇండియా రీజినల్ మేనేజర్ కేఎస్ఆర్ మూర్తి వీవీఐటీని సందర్శించారు. ఎలక్ట్రికల్ వాహనాల తయారీ, కాంపోనెంట్ల ఉత్పాదకతపై దృష్టిసారించిన సంస్థ ఆంధ్రప్రదేశ్ నందు నూతన ప్లాంట్ల ఏర్పాటులో భాగంగా నైపుణ్యం గల విద్యార్థుల కోసం కళాశాలను సందర్శించారు. జేబీఎం సంస్థ సాంకేతిక విద్యార్థులకు ఈవీ వాహనాల తయారీపై ఇంటర్న్‌షిప్ ఇస్తుందన్నారు. దీని ద్వారా విద్యార్థులకు తమ నైపుణ్యాభివృద్ధికి విస్తారమైన అవకాశాలు లభిస్తాయి. కళాశాలలోని సీమన్స్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని సందర్శించిన ప్రతినిధులు.. విద్యార్థులకు ఉపాధి, ఇంటర్న్‌షిప్ లపై చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌తో చర్చించారు.